సాక్షి తిరుపతి

శుక్రవారం, 9, జూన్, 2023



ఆటోను ఢీకొన్న ఇన్నోవా

రాపూరు–పెంచలకోన మార్గమధ్యంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో 22 మంది గాయపడ్డారు. - 8లో



కైలాస గిరులు దగ్ధం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలోని కై లాసగిరులు గురువారం దగ్ధమయ్యాయి.

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	39	27
చిత్తూరు	38	27
తిరుమల	36	23
గూడూరు	42	30
నగరి	41	28

న్యూస్‌రీల్

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

తిరుపతి అర్బన్: గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో వలంటీర్లుగా పనిచేయడానికి శుక్రవారం నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి గురువారం సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆ మేరకు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు నోటిఫికేషన్ విడుదల చేయాలని సూచించారు. ఈనెల 9 నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరించాలన్నారు. 19న దరఖాస్తుల పరిశీలన, 20వ తేదీన ఇంటర్వ్యూలు ఉంటాయని వెల్లడించారు. అదే రోజు డ్యూటీలో చేరేలా ఆదేశాలు ఇచ్చామని స్పష్టం చేశారు.

బ్రహ్మోత్సవాలకు బస్సులు సిద్ధం



ఉద్యోగులచేత ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీటీవో చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: తిరుమల రెండో బ్రహ్మోత్సవాలకు ఆర్టీసీ బస్సులను సిద్ధం చేయాలని డీపీటీఓ చెంగల్‌రెడ్డి సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని గ్యారేస్‌లో ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. మెకానిక్స్‌తో ఆయన మాట్లాడుతూ తిరుమల ఘాట్‌రోడ్డులో ప్రమాదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆ మేరకు ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయించారు. డిపో మేనేజర్ టీ.బాలాజీ, బస్‌స్టేషన్ ఏటీఎం డీ.రామచంద్రనాయుడు, అసిస్టెంట్ మేనేజర్ వేణు, అసిస్టెంట్ ఇంజినీర్ పి.చాందిని, వివిధ అసోసియేషన్ ప్రతినిధులు, డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

తొలిరోజే జగనన్న విద్యాకానుక కిట్లు

తిరుపతి అర్బన్: పాఠశాల ప్రారంభం నాటికే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. తిరుపతి కలెక్టర్ కార్యాలయం నుంచి గురువారం ఆయన సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న విద్యాకానుక నాణ్యతను మండల పరిధిలో పరిశీలించడం, మండల స్టాక్ పాయింట్, నాడు–నేడు పనులకు సంబంధించి మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించాలని వివరించారు. డాక్టర్ కాన్సెప్ట్ విధానంలో గుర్తించిన డయాబెటీస్, హైపర్‌టెన్షన్ గల వారికి క్రమం తప్పకుండా నెలకు సరిపడా మందులు అందించాలన్నారు. జిల్లాలో 18,360 గర్భవతులు ఉంటే హైరిస్క్ ఇద్దరిని గుర్తించారని చెప్పారు. జగనన్నకు చెబుదాం 1902 ద్వారా అందిన 1,496 ఫిర్యాదులలో 66 శాతం పూర్తి చేశారని చెప్పారు. సమీక్షలో సీపీఓ అశోక్‌కుమార్, డీఎల్‌డీఓ సుశీలదేవి, ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి, డీఎంహెచ్ఓ శ్రీహరి పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



తిరుపతి రూరల్/ రేణిగుంట: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం తిరుపతి, రేణిగుంట ప్రాంతాల్లోని పలు దుకాణాల్లో తనిఖీలు చేశారు. కార్మికశాఖ సహాయ కమిషనర్ చిన్నలాలెప్ప ఆధ్వర్యంలో సహాయ కార్మికశాఖాధికారులు శ్రీమన్నారాయణ, రాజయ్య, ఐసీడీఎస్ అధికారి శివశంకర్, ప్రగతి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సంయుక్తంగా పలు దుకాణాలు, సంస్థల్లో పరిశీలన చేశారు. 14 ఏళ్లలోపు చిన్నారులను పనిలో పెట్టుకోవడం నేరమన్నారు. ఎవరైనా పనిలో పెట్టుకుంటే యాజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జూన్ 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఈ తనిఖీలు నిర్వహిస్తామని ఏసీఎల్ చిన్నలాలెప్ప తెలిపారు.

గతంలో మోసం.. ప్రస్తుతం న్యాయం



తిరుపతి రుయాలో పాలాభిషేకం చేస్తున్న చిత్తూరు జిల్లా ఏపీ హంస, గవర్నమెంట్ ఎంప్లాస్ ఫెడరేషన్ నాయకులు

- సీపీఎస్ ఉద్యోగులకు న్యాయం చేసేలా జీపీఎస్
- ఉద్యోగుల పెన్షన్‌కు భరోసా కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం
- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 16,458 మంది సీపీఎస్ ఉద్యోగులున్నారు. కొన్నేళ్ల నుంచి సీపీఎస్ రద్దు కోసం ఎదురు చూస్తున్న ఆ ఉద్యోగులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీపికబురు చెప్పింది. సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగ విరమణ చెందాక ఎలాంటి ఉపయోగం ఉండదు. దీనిపై పాదయాత్రలో సీపీఎస్ రద్దుకు హామీ ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీపీఎస్‌ను అమలు చేసి హామీ నెరవేర్చారు.

జీపీఎస్‌తో మరింత భద్రత.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీపీఎస్ విధానం వల్ల సీపీఎస్ ఉద్యోగులకు మరింత భద్రత కలగనుంది. ఉద్యోగి పెన్షన్‌కు నమ్మకమైన భరోసా లభించింది. ఉద్యోగ విరమణ తర్వాత చివరి నెల బేసిక్‌లో 50 శాతం పెన్షన్‌గా ఇవ్వనున్నారు. మొత్తం పెన్షన్ తో పాటు ప్రతి ఏటా 2 డీఏలు ఇవ్వనున్నారు. ఉద్యోగుల భవిష్యత్తు, వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం జీపీఎస్‌ను అమలు లోకి తీసుకొచ్చింది. ప్రస్తుత జీపీఎస్ విధానం 01-09-2004 తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారికి వర్తిస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. సీపీఎస్‌కు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీపీఎస్ విధానం ఉద్యోగ విరమణ తర్వాత పెన్షన్‌కు పూర్తి గ్యారంటీ ఇస్తుందని విద్యావేత్తలు వెల్లడిస్తున్నారు.



సూళ్లూరుపేటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

చంద్రబాబు అధికారంలో ఉన్న రోజుల్లో సీపీఎస్ రద్దుకు ఏ మాత్రం పట్టించుకోలేదు. అయితే ప్రస్తుతం సీపీఎస్ ఉద్యోగులకు న్యాయం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీపీఎస్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు. కేబినేట్‌లో సైతం జీపీఎస్ విధానానికి ఆమోదం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలులోకి తీసుకొచ్చిన జీపీఎస్ విధానం దేశానికే ఆదర్శంగా నిలిచిందని విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జీపీఎస్‌తోనే గ్యారంటీ



జీపీఎస్‌తో మాకు పెన్షన్ గ్యారంటీ లభించింది. చాలా సంవత్సరాలుగా సీపీఎస్ రద్దు కోసం పోరాడుతునే ఉన్నాం. టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం సీఎం జీపీఎస్‌ను అమలు చేయడం సంతోషకరం.

– కుమారస్వామి, సీపీఎస్ ఉద్యోగి, తిరుపతి జిల్లా

భద్రత కల్పించారు



సీపీఎస్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం భద్రత కల్పించింది. జీపీఎస్ విధానం అమలు చేయడం గొప్ప విషయం. ఈ విధానం వల్ల సీపీఎస్ ఉద్యోగులకు ఎంతో మేలు కలిగింది. గతంలో సీపీఎస్ ఉద్యోగుల సమస్యను ఏ ప్రభుత్వమూ పట్టించుకోనేలేదు.

– వినాయకం, సీపీఎస్ ఉద్యోగి, చిత్తూరు

నమ్మకమైన భరోసా



ప్రభుత్వం ప్రకటించిన జీపీఎస్ మాకు నమ్మకమైన భరోసా. రిటైర్‌మెంట్ తర్వాత చివరి నెల బేసిక్‌లో 50 శాతం పెన్షన్ ఇవ్వడం హర్షణీయం. సీపీఎస్ విధానం సరైనది కాదు.

– నాగరాజు నాయక్, తిరుపతి జిల్లా

సీపీఎస్ కంటే మెరుగు



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీపీఎస్, సీపీఎస్ కంటే మెరుగ్గా ఉంది. జీపీఎస్ విధి విధానాలను జారీ చేసేందుకు కృషి చేయాలి. కేబినేట్‌లో నిర్ణయం తీసుకుని అమలు చేస్తామని ప్రకటించడం అభినందనీయం.

– సమీర్, సీపీఎస్ ఉద్యోగి, చిత్తూరు జిల్లా

సైకిలెక్కకుండానే గాలితీసేశారు!

- శ్రీకాళహస్తి టీడీపీలో వర్గపోరు
- పార్టీ కండువా కప్పుకోకనే ఎస్సీవీ పరువుతీసిన ఆ ఇద్దరు
- బొజ్జల సుధీర్‌ని కలిశాకే పార్టీ కండువా?
- తేల్చి చెప్పిన చంద్రబాబు.. షాక్‌లో మాజీ ఎమ్మెల్యే
- 14న కుప్పంలో శ్రీకాళహస్తి పంచాయితీ



సాక్షి, తిరుపతి: పార్టీలో చేరకముందే ఆ ఇద్దరూ మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు పరువు తీశారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ని కలిశాకే రమ్మని తేల్చిచెప్పడంతో మాజీ ఎమ్మెల్యే షాక్‌కు గురయ్యారు. కండువా కప్పుకోక ముందే ఇదేం పంచాయితీ అంటూ ఎస్సీవీ నాయుడు తలపట్టుకుంటున్నారు. శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు పేరు వింటే.. తరచూ పార్టీలు మారే నాయకుడని అందరికీ తెలుసు. టీడీపీలో బొజ్జల గోపాలకృష్ణారెడ్డికి ముఖ్యఅనుచరుడుగా ఉంటూ... ప్రతి ఎన్నికలో ఆయన కోసం పనిచేసేవారు. అయినా టీడీపీలో గుర్తింపు లేదని భావించి 2003లో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరి, 2004లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో జరిగిన ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో సైలెంట్‌గా ఉంటూ.. తన పనులు తాను చేసుకుంటూ ఉండేవారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ నుంచి టికెట్ ఆశించినా ప్రయోజనం లేకపోవడంతో చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక మళ్లీ టీడీపీలో చేరిపోయారు. టీడీపీ ప్రభుత్వంలో తనను ఎవ్వరూ పట్టించుకోలేదంటూ.. 2019 ఎన్నికల సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బొజ్జల గోపాలకృష్ణారెడ్డిని, ఆయన కుటుంబంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తూ ఉండేవారు.

డామిట్.. కథ అడ్డం తిరిగింది

శ్రీకాళహస్తి టీడీపీ ఇన్‌చార్జ్ సుధీర్‌రెడ్డి అభ్యర్థిత్వంపై పార్టీ శ్రేణుల్లో మంచి అభిప్రాయం లేకపోవడం.. వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని ఎస్సీవీ నాయుడు గ్రహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉంటూ.. టీడీపీ నేతలతో సఖ్యతగా ఉండడం ప్రారంభించారు. అందులో భాగంగా ఇటీవల బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సంవత్సరీకానికి మరో మాజీ ఎమ్మెల్యేతో కలిసి సుధీర్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. పేరుకు సంవత్సరీకానికి వెళ్లామని చెప్పుకున్నా.. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా పనిచేసేందుకు కుట్రలకు తెరదీశారు. విషయం బయటపడడంతో టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా ఇటీవల చంద్రబాబుని కలిసి.. పార్టీలో చేరికపై నిర్ణయం తీసుకున్నారు. అయితే చంద్రబాబుని కలిసిన విషయం, పార్టీలో చేరిక విషయం బొజ్జల సుధీర్‌రెడ్డికి తెలియదు. ఎస్సీవీ నాయుడు చేరిక వెనుక దాగి ఉన్న రహస్యాన్ని తెలుసుకున్న బొజ్జల సుధీర్‌రెడ్డి బుధవారం వాయిస్ రికార్డు విడుదల చేశారు. 'ఎస్సీవీ నాయుడు గురువారం పార్టీలో చేరడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ అయిన నాకు ఎటువంటి సమాచారం లేదు. కావున టీడీపీ శ్రేణులు ఎవ్వరూ ఎస్సీవీ నాయుడుతో వెళ్లొద్దు' అని స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న చంద్రబాబు ఎస్సీవీ చేరికను వాయిదా వేశారు. దీంతో ఎస్సీవీ నాయుడు చేరికపై సందిగ్ధం నెలకొంది.

పోయిన పరువు

పార్టీలో చేరక ముందే అటు చంద్రబాబు.. ఇటు బొజ్జల సుధీర్‌రెడ్డి తన పరువు తీశారని ఎస్సీవీ నాయుడు మనస్తాపానికి గురైనట్లు సమాచారం. టీడీపీలో చేరేందుకు ఏర్పాట్లన్నీ చేసుకున్నాక నియోజకవర్గంలో ఎలా తలెత్తుకు తిరగాలని అనుచరుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. 'బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ప్రతి గెలుపు కోసం నేను ఎంతగా కష్టపడ్డానో చంద్రబాబు తెలియదా? అంతెందుకు.. బొజ్జల కుటుంబానికి తెలియదా?' ఇంత అవమానం జరిగాక ఈనెల 14న కుప్పంకి ఎలా వెళ్లాలి? పార్టీలో ఎలా చేరాలి. ఒకవేళ చేరినా.. అడుగడుగునా అవమానించరని గ్యారెంటీ ఉందా..?' అని తన అనుచరుల వద్ద ఎస్సీవీ తీవ్ర మనోవేదనకు గురైనట్లు ప్రచారం జరుగుతోంది.

పులివెందుల తరువాత పుంగనూరే

'రాష్ట్రంలోనే పులివెందుల తరువాత పుంగనూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం'అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు.

- ప్రతి ఇంటికీ తాగునీరందిస్తాం
- రాష్ట్ర విద్యుత్, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి



చౌడేపల్లె మండలం కాటిపేరి వద్ద ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు/సదుం/చౌడేపల్లె: ప్రజలకు అన్ని రకాల కార్పొరేట్ వైద్యసేవలు అందించేందుకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీలో అన్ని రకాల జబ్బులకు వైద్యసేవలు అందిస్తున్నట్లు మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయన గురువారం చిత్తూరు ఎంపీ రెడ్డెప్పతో కలిసి పుంగనూరు, సదుం, చౌడేపల్లె మండలాల్లో పలు నిర్మాణాలను, అభివృద్ధి పనులను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వాస్పత్రితో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వారికి అనుకూలంగా ఉండేందుకు అర్బన్ హెల్త్ సెంటర్లను ప్రారంభించామన్నారు. ముడిబాపనపల్లె కేంద్రం నుంచి ప్రజలకు అన్ని రకాల వైద్యసేవలు అందిస్తున్నామని తెలిపారు. కడప జిల్లా గండికోట రిజర్వాయర్ నుంచి పైపులైన్ల ద్వారా పడమటి నియోజకవర్గాలకు నీరు సరఫరా చేసే కార్యక్రమం పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి ఇంటికీ నీటిని సరఫరా చేస్తామన్నారు. ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే 6.5 టీఎంసీల సామర్థ్యం గల ప్రాజెక్టులను ఎవరు అడ్డుకున్నా, నిర్మించి తీరుతామని స్పష్టం చేశారు. సదుం మండలం ఎర్రాతివారిపల్లెలో మంత్రి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు గుర్తుచేశారు. అందులో భాగంగానే ఇక్కడ వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి మంత్రి పెద్దిరెడ్డిని, జిల్లా కలెక్టర్‌ను, చిత్తూరు ఎంపీని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, కలెక్టర్ షణ్మోహన్, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రభాకరరెడ్డి, టీటీడీ పాలక మండలి సభ్యుడు పోకల అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

మంత్రి ప్రారంభించిన నిర్మాణాలు

- పుంగనూరు మున్సిపాలిటీ పరిధిలోని తూర్పుమొగసాల, రాగానిపల్లె రోడ్డులో రూ.1.6 కోట్లతో నిర్మించిన రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలు
- కోర్టు రోడ్డులో 2.6కోట్లతో నిర్మించిన మినీ సచివాలయ నూతన భవనం
- శాంతినగర్‌లో రూ.90 లక్షలతో విద్యుత్‌లైన్ల మార్పిడి పనులు
- చెర్లోపల్లె వద్ద రూ.97 కోట్లతో 220 కేవీ సబ్ స్టేషన్ పనులు
- సదుం మండలం ఎర్రాతివారిపల్లె మార్గంలో రూ.8 కోట్లతో నిర్మించనున్న వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణానికి భూమిపూజ
- జాండ్రపేట వద్ద రూ.4.60 కోట్లతో నిర్మించిన వంతెన, వంతెనపై రూ.10.62 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన లైటింగ్ సిస్టం
- చౌడేపల్లె మండలం కాటిపేరి సమీపంలో ఆచార్య ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయం అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు భూమిపూజ
- చౌడేపల్లె – పుంగనూరు మార్గంలోని దొరబావితోట సమీపంలో రూ.1.60 కోట్లతో నిర్మించిన రూరల్ సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ భవన సముదాయం

ఇంటింటికీ తాగునీరు

చౌడేపల్లె మండలంలో ప్రారంభోత్సవాల అనంతరం మంత్రి మాట్లాడుతూ, నియోజకవర్గంలో ప్రతి ఊరిలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించి ఇంటింటికీ తాగునీరందిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు ఉపాధితోపాటు, ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ధ్యేయంతో సీఎం ఆశీసులతో నియోజకవర్గంలో అగ్రికల్చర్, వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలోనే పులివెందుల తరువాత పుంగనూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని గుర్తుచేశారు. కాటిపేరి సమీపంలో 56 ఎకరాల్లో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను రూ.8 కోట్లతో నిర్మిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు సమీప గ్రామాల్లోనే అగ్రికల్చర్ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్ ఉద్యోగాలు పొందవచ్చన్నారు.



పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

ఎం'జాయ్ రైడ్'!

- 16 నుంచి హెలికాప్టర్ జాయ్ రైడ్
- తిరుపతి టు చంద్రగిరి కోట



హెలి జాయ్‌రైడ్ బ్రోచర్, బుకింగ్‌ను ప్రారంభిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం తిరునగరితో పాటు 500 ఏళ్ల నాటి చంద్రగిరి కోట అందాలను ఆకాశం నుంచి వీక్షించే అవకాశం అందుబాటులోకి రానుంది. హెలీకాప్టర్ ద్వారా చంద్రగిరి, తిరుపతి అందాలను వీక్షించే విధంగా ఏరోడాన్ హెలీ చాప్టర్ సంస్థ హెలి జాయ్ రైడ్‌ను ప్రారంభించనుంది. గురువారం తిరుపతి ఏఆర్ పోలీస్ గ్రౌండ్ వేదికగా సంస్థ నిర్వాహకులతో కలిసి చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హెలికాప్టర్ జాయ్ రైడ్ బ్రోచర్, బుకింగ్ ప్రక్రియను ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ప్రయోగాత్మకంగా పరిశీలించనున్నట్లు తెలిపారు. తిరుపతి ఎస్పీ కార్యాలయ మైదానం నుంచి బయలుదేరి చంద్రగిరి కోటను చుట్టి తిరిగి మైదానానికి చేరుకుంటుందన్నారు. ఇందుకు ఒక్కొక్కరికి రూ.6 వేలు రుసుం నిర్ధారించినట్టు వెల్లడించారు. ఒక్కో రైడ్‌లో ఐదుగురు మాత్రమే ప్రయాణించగలరని చెప్పారు. ఈ రైడ్ కోసం 93848 48441, www.aerodon.in ద్వారా బుకింగ్ చేసుకోవచ్చని సూచించారు. ఈ నాలుగు రోజులు జాయ్ రైడ్ విజయవంతమైతే తిరుపతి టు చెన్నై హెలిజాయ్ రైడ్ ఏర్పాటు ఆలోచన కూడా ఉందని పేర్కొన్నారు.

13న సామూహిక అక్షరాభ్యాసం

శ్రీకాళహసిత: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13వ తేదీ మంగళవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు ఈఓ సాగర్‌బాబు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీమేధా దక్షిణ మూర్తి వద్ద ఉదయం 8గంటలకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు.


నైలెట్.. హైలెట్!

ఆధ్యాత్మిక సిగలో మరో మణిహారం వచ్చి చేరనుంది. ఇప్పటికే ఇక్కడ కొలువైన విద్యాసంస్థలకు తోడు మరో అంతర్జాతీయ విద్యాసంస్థ నైలెట్ రాష్ట్రానికే కాదు.. ఇతర రాష్ట్రాలకు సైతం హైలెట్‌గా నిలవనుంది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి కావాల్సిన నాణ్యమైన మానవ వనరులను అభివృద్ధి చేసి ప్రపంచానికి అందించేందుకు ఇది దోహదపడనుంది. ఇటీవల కమిటీ పరిశీలనానంతరం కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మరో రెండుమూడు నెలల్లో ఎస్వీయూ వేదికగా ఎన్‌ఐఈఎల్‌ఐటీ ఏర్పాటు కానుండడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

- ఆధ్యాత్మిక నగరానికి మరో మణిహారం
- రాష్ట్ర ప్రభుత్వ కృషితో 'నైలెట్'కి గ్రీన్‌సిగ్నల్
- ఎస్వీయూలో ఏర్పాటుకు సన్నాహాలు
- అందుబాటులోకి రానున్న 30 కోర్సులు

సాక్షి, తిరుపతి: ప్రపంచస్థాయి విద్యాసంస్థ ఎన్‌ఐఈఎల్‌ఐటీ (నైలెట్) ఏర్పాటుకు కేంద్రం నుంచి అనుమతులు లభించాయి. ఈ విద్యాసంస్థను తిరుపతి ఎస్వీయూనివర్సిటీలో ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా 30 కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. తిరుపతి పరిసర ప్రాంతాల్లో ఎనిమిది యూనివర్సిటీలు, 22 ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. వీటి నుంచి ఏటా ఆరువేల మంది యువకులు విద్యాభ్యాసం పూర్తిచేసి బయటకు వస్తున్నారు. వీరు వృత్తి విద్య కోర్సుల తోపాటు టెక్నాలజీ రంగంలో ఉద్యోగ అవకాశాల కోసం అవసరమైన కోర్సులు నేర్చుకోనేందుకు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాలకు వెళ్తున్నారు. ప్రస్తుతం ఆ అవసరం లేకుండా తగిన నైపుణ్యాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నైలెట్ విద్యాసంస్థను తీసుకురావాలని భావించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఎంపీ మద్దెల గురుమూర్తి గత సంవత్సరం రోజులుగా పలుమార్లు కేంద్ర మంత్రి, మంత్రిత్వ శాఖ అధికారులతో భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఇటీవల తిరుపతికి వచ్చిన కమిటీ ఎంపీతో సమావేశమైంది. ఆ కమిటీ నివేదిక మేరకు తిరుపతిలో నైలెట్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది.

సీఎం కృషి ఫలితం



ప్రతిష్టాత్మకమైన ఈ ప్రాజెక్టు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి ఫలితంగానే ఎన్‌ఐఈఎల్‌ఐటీ వస్తోంది. తిరుపతిలో నైలెట్ ఏర్పాటుతో ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు ఆస్కారం లభించింది. దీనిద్వారా ఇన్ఫర్మేషన్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐఈసీటీ) అనుబంధ రంగాలలో నాణ్యమైన మానవ వనరులను అభివృద్ధి చేయొచ్చు. ఇందుకు రూ 6.41 కోట్లు మంజూరు కాగా మొదట విడతగా రూ.2.54 కోట్లు విడుదల చేయనుంది. ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేసిన మూడేళ్ల నుంచి ఏడాదికి వెయ్యి మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనుంది. – మద్దెల గురుమూర్తి, ఎంపీ, తిరుపతి

ఎంతో మేలు



తిరునగరికి వస్తున్న నైలెట్ విద్యాసంస్థ చాలా ఉపయోగకరం. దీనివల్ల వేలాది మంది విద్యార్థులకు మేలు కలుగుతుంది. సీఎం జగన్‌కు ధన్యవాదాలు. – కిషోర్‌దాస్, ఎస్వీ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి

హర్షణీయం

తిరుపతి ఎస్వీయూకి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్‌ఐఈఎల్‌ఐటీ) సెంటర్ మంజూరు చేయడం హర్షణీయం. ఇది రావడానికి కృషి చేసిన ఎంపీకి కృతజ్ఞతలు. – ప్రొఫెసర్ కే.రాజారెడ్డి, ఎస్వీయూ వీసీ

సీసీ కెమెరా, సెక్యూరిటీ అలారమ్‌పై ఉచిత శిక్షణ

తిరుపతి రూరల్(చంద్రగిరి): గ్రామీణ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు యూనియన్ బ్యాంకు గ్రామీణ ఉపాధి సంస్థ డైరెక్టర్ సురేష్ బాబు గురువారం తెలిపారు. గ్రామీణ యుతవకు ఉపాధి కల్పించేందుకు ఈనెల 15 నుంచి 13 రోజుల పాటు ఉచితంగా సీసీ కెమెరా ఇన్‌స్టాలింగ్, సర్వీసింగ్, సెక్యూరిటీ అలారమ్, స్మోక్ డిటెక్టర్లపై పురుషులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగి తిరుపతి, చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతాలకు చెంది 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, కనీసం 10వ తరతగి చదువుకున్న వారు అర్హులన్నారు. శిక్షణ సమయంలో ట్రైనీస్‌కు ఉచిత భోజనం, హాస్టల్ సౌకర్యం కల్పించనున్నట్లు వెల్లడించారు. రాను–పోను ఒక్కసారి బస్సు చార్జీలు ఇవ్వడంతో పాటు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువీకరణ త్రాలను అందజేస్తామన్నారు. ఆసక్తిగల వారు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్, 4 పాస్ పోర్టు సైజు ఫొటోలతో నేరుగా సంస్థ వద్దకు వచ్చి వారి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఒక్కో బ్యాచ్‌కు 25 నుంచి 30 మందిని చేర్చుకుంటామని, ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణాభివృద్ధి సంస్థ, ద్వారకానగర్, కొత్తపేట, చంద్రగిరి. ఫోన్ నంబరు 79896 80587, 63017 17672లలో సంప్రదించాలని కోరారు.

రూరల్ విజేత భజరంగి

- రెండో స్థానానికే పరిమితమైన అవిలాల జట్టు
- ఉత్కంఠ భరితంగా.. చంద్రగిరి ఐపీఎల్ ఫైనల్స్
- సిక్సర్ల మోత మోగించిన మంగళం జట్టు
- చంద్రగిరి మండలం విన్నర్స్‌గా చంద్రగిరి మురళీ ఎలెవన్స్ జట్టు
- రన్నర్స్‌గా ఆముదాల కోన జట్టు
- సంబరాలు చేసుకున్న మంగళం యువత
- విజేతలకు ట్రోఫీలు బహూకరించిన కలెక్టర్, ఎస్పీ
- రూ.4.25 లక్షలు నగదు బహుమతి అందజేత


తిరుపతి రూరల్ మండల విజేతగా నిలిచిన మంగళం భజరంగి జట్టుకు ట్రోఫీ, నగదును బహూకరిస్తున్న కలెక్టర్

తిరుపతి రూరల్: గత 25 రోజులుగా కుర్రకారును ఉర్రూతలూగిస్తున్న చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్ దశకు చేరింది. చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వైఎస్సార్ గ్రామీణ మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో గురువారం తిరుపతి రూరల్ మండల పరిధిలోని మంగళం భజరంగి జట్టు, చంద్రగిరి మండల పరిధిలోని అవిలాల జట్లు ఫైనల్స్‌లో హోరాహోరీగా తలపడ్డాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో భజరంగి జట్టు విజేతగా నిలిచింది. చంద్రగిరి మండలం ఫైనల్స్‌లో మురళీ ఎలెవన్స్ జట్టు (చంద్రగిరి), కింగ్స్ ఎలెవన్స్ (ఆముదాల కోన) జట్లు తలపడగా.. చంద్రగిరి మురళీ ఎలెవన్స్ జట్టు విజయం సాధించింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమిష్టిగా రాణించిన మురళీ ఎలెవన్స్ జట్టు మండల విజేతగా నిలిచింది.

హోరాహోరీగా భజరంగి, అవిలాల పోరు

చంద్రగిరి నియోజకవర్గంలో అతిపెద్ద మండలంగా ఉన్న తిరుపతి రూరల్ మండలం నుంచి ఫైనల్స్‌కు చేరిన భజరంగి జట్టు (మంగళం), అవిలాల బీస్ట్ (వినాయక నగర్) జట్ల మధ్య హోరాహోరీ పోరు జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అవిలాల బీస్ట్ జట్టు 15 ఓవర్లకు 136 పరుగులు సాధించింది. తర్వాత బ్యాటింగ్ చేపట్టిన భజరంగి జట్టు 14 ఓవర్లలోనే 138 పరుగులు సాధించి విజేతగా నిలిచింది. భజరంగి జట్టుకు చెందిన బ్యాట్స్ మన్ వినోద్ సిక్సర్ల మోత మోగించి 56 పరుగులతో అజేయంగా నిలిచాడు. బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా నిలిచారు.

విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతి

తిరుపతి రూరల్ మండలం స్థాయి ఫైనల్స్‌లో విజేతగా నిలిచిన భజరంగి జట్టు (మంగళం)కు కలెక్టర్ వెంకటరమణారెడ్డి చేతులు మీదుగా ట్రోఫీతో పాటు లక్ష రూపాయల నగదు బహుమతి అందించారు. అలాగే చంద్రగిరి మండలం ఫైనల్స్ మ్యాచ్‌లో విజేతగా నిలిచిన మురళీ ఎలెవన్స్ (చంద్రగిరి) జట్టుకు తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి ట్రోఫీతో పాటు లక్ష రూపాయల నగదు బహుమతి అందించారు. అలాగే రన్నర్స్‌గా నిలిచిన అవిలాల బీస్ట్ జట్టుకు రూ.75 వేలు, కింగ్స్ ఎలెవన్స్ ఆముదాల కోన జట్టుకు రూ.75 వేలు అందజేశారు. అదేవిధంగా చంద్రగిరి మండలం నుంచి తృతీయ స్థానంలో నిలిచిన తొండవాడ గ్లాడియేటర్స్ జట్టుకు రూ.50 వేలు, రాయల్ ఎలెవన్స్ (రాయలపురం) జట్టుకు రూ.25 వేలు అందించారు. తిరుపతి రూరల్ మండలం నుంచి మూడు, నాలుగు స్థానాల్లో జరగాల్సిన మ్యాచ్‌లు వాయిదా వేశారు.

సందడే.. సందడి

తిరుపతి రూరల్ మండలం ఫైనల్స్ మ్యాచ్‌లో బ్యాటింగ్ చేత బట్టిన భజరంగి జట్టు వెంట వచ్చిన ప్రేక్షకులు సిక్స్ కొట్టిన ప్రతి సారీ కేరింతలు కొట్టి సందడి చేశారు. చివరకు భజరంగి జట్టు గెలవడంతో భారీగా టపాకాయలు పేల్చి సంబరాలు చేసుకున్నారు. యువనేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని భుజాలపైకి ఎత్తుకుని గంతులు వేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.


చంద్రగిరి మండల విజేతగా నిలిచిన చంద్రగిరి మురళీ ఎలెవన్స్ జట్టుకు ట్రోఫీ, నగదును బహూకరిస్తున్న ఎస్పీ


చంద్రగిరి మండల రన్నర్స్‌గా నిలిచిన ఆముదాలకోన కింగ్స్ ఎలెవన్స్ జట్టుకు ట్రోఫీ, నగదును బహూకరిస్తున్న ఎస్పీ



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,400
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,514
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,200
రిటైల్ వెండి గ్రాము	రూ.76.20

భారీ జెర్రిపోతులు


జెర్రిపోతులతో భాస్కర్‌నాయుడు

తిరుమల : తిరుమలలో గురువారం రెండు భారీ జెర్రిపోతులు కలకలం సృష్టించాయి. బాలాజీనగర్‌కు సమీపంలోని పాచిగంగమ్మ ఆలయం వద్ద రెండు పాములు వచ్చినట్లు ఆలయ పూజారి టీటీడీ అటవీశాఖ ఉద్యోగి భాస్కర్ నాయుడుకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న భాస్కర్‌నాయుడు చాకచక్యంగా రెండు భారీ జెర్రిపోతులను పట్టుకున్నారు. వాటిలో ఒకటి తొమ్మిది అడుగులు, మరొకటి ఆరు అడుగుల పొడవు ఉన్నాయి. వాటి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో విశ్వంకు రాష్ట్ర స్థాయి ర్యాంకులు


విద్యార్థులను అభినందిస్తున్న విశ్వం విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్: ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల(ఏపీఆర్‌జేసి)ల్లో ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులతో పాటు టాప్ 10లో 9ర్యాంకులను కైవసం చేసుకున్నారు. ఆ మేరకు ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాల్లో ఆర్.తనూజ, ఎం.భువనేశ్వర్‌రెడ్డి రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకులు, టి.వర్షా, కె.లక్ష్మణవర్మ ద్వితీయ, బి.భువనేశ్వరి, బి.సిద్ధార్థలు తృతీయ ర్యాంకులు, అలాగే పి.సౌమ్య 5వ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆ విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎస్.తులసి, ఉపాధ్యాయులు అభినందించారు.

డైమండ్ ఎక్స్‌పో ప్రారంభం


డైమండ్ ఎక్స్‌పో ప్రారంభం సందర్భంగా పూజ చేస్తున్న బిగ్‌బాస్ ఫేం దివి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో గురువారం మాధురి గోల్డ్ సంస్థ ఏర్పాటుచేసిన డైమండ్ ఎక్స్‌పోను బిగ్‌బాస్ ఫేం దివి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డైమండ్ జ్యువెలరీ కేవలం ఉన్నత, మధ్య తరగతి వర్గాలకే కాకుండా అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉండే విధంగా ఎగ్జిబిషన్ ఉందన్నారు. 14వ తేదీ వరకు ఈ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని ఆ సంస్థ యాజమాన్యం తెలియజేసింది.

మృతుల కుటుంబాలకు ఆప్కో ఎక్స్‌గ్రేషియా


మృతుల కుటుంబాలకు నగదు పంపిణీ చేస్తున్న ఆప్కో చైర్మన్

తిరుపతి కల్చరల్: మృతి చెందిన చేనేత కార్మిక కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ ఆప్కో ముందుకొచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా గురువారం రూ.23 లక్షల చెక్కులు పంపిణీ చేసింది. ఇందులో భాగంగా తిరుపతి జిల్లాలో మృతిచెందిన పది మంది చేనేత కార్మిక కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా కింద ఒక్కోకుటుంబానికి రూ.12,500 చొప్పున అందజేసినట్టు ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి తెలిపారు. ఈమేరకు ఆయన నారాయణవనంలోని సంబంధిత కుటుంబాలకు వెళ్లి చెక్కులు అందజేశారు. జిల్లా చేనేత శాఖాధికారి జి.వెంకటరామ్, ఆప్కో మండల వాణిజ్య అధికారి బి.గోపాలకృష్ణ, సహాయ మండల వాణిజ్య అధికారి సుబ్బానాయుడు, డీవోలు వెంకటేశ్వర్లు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

టాటా ట్రక్కు ఆటోను ఢీకొన్న ఇన్నోవా


క్షతగాత్రుల ఆర్తనాదాలు


ప్రమాదంలో బోల్తాపడిన ట్రక్కు ఆటో



చెల్లాచెదురుగా పడి ఉన్న క్షతగాత్రులు

రాపూరు: నెల్లూరు జిల్లా రాపూరు–పెంచలకోన మార్గమధ్యంలోని జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 22 మందికి గాయాలైనట్టు ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్ తెలిపారు. వివరాలు.. ప్రకాశం జిల్లా, హనుమంతపాడు మండలం, వలిచర్ల గ్రామానికి చెందిన మూడు కుటుంబాల వారు నెల్లూరు జిల్లా కొత్తకోడూరులో జరిగే మేరీమాత ఉత్సవాలకు గురువారం ఉదయం బయలుదేరి రాపూరు మీదుగా కొత్త కోడూరుకు వెళ్లేందుకు వస్తున్నారు. ఈ క్రమంలో రాపూరు మండలం గోనుపల్లి, పెనుబర్తి గ్రామాల మధ్య ఎదురుగా వస్తున్న ఇన్నోవా వాహనం ట్రక్ ఆటో చివరభాగాన ఢీ కొంది. దీంతో ట్రక్ ఆటో బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న 22 మందికి గాయాలయ్యాయి. ఇందులో ఐదుగురు తీవ్రంగా గాయపడినట్టు సమాచారం. కేసు దర్యాప్తులో ఉంది.

మూలస్థాన ఎల్లమ్మకు ఆన్‌లైన్ సేవ

- నిత్యాన్నదానం..నిత్యాన్నదాన ట్రస్ట్ ఏర్పాటు
- లాంఛనంగా ప్రారంభించిన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి
- మొదటి దాతగా రూ.10,116 అందించిన పీసీఆర్


భక్తులకు ఆన్‌లైన్ టికెట్లు అందిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): జిల్లాలోనే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోనూ సత్యదేవతగా ప్రసిద్ధిగాంచిన చంద్రగిరి శ్రీమూలస్థాన ఎల్లమ్మ దర్శనం ఇక మరింత సులభతరం కానుంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఎలాంటి ఆలస్యం కాకుండా, శీఘ్ర దర్శనం చేసుకునేలా ఆలయ పాలకమండలి చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, సభ్యులు ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేస్తున్నారు. గురువారం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు హర్షిత్‌రెడ్డి ఈ విధానాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఆలయ ముఖమండపం వద్ద ఆన్‌లైన్ విధానం ద్వారా రూ.20 చెల్లించి రెండు అర్చన టిక్కెట్లను కొనుగోలు చేశారు. అంతకుముందు ఆలయం వద్దకు చేరుకున్న హర్షిత్‌రెడ్డికి ఆలయ పాలకమండలి సభ్యులు, ఈవో సుధాకర్ రెడ్డి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థ ప్రసాదాలను అందించారు.

నిత్యాన్నదానం...ట్రస్టను ప్రారంభం

మూలస్థాన ఎల్లమ్మ అమ్మవారి చెంత నిత్యాన్నదానం చేయాలని పాలకమండలి చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి తలంచారు. దేవదాయశాఖ నిబంధనల మేరకు రూ.50 లక్షలు డిపాజిట్ ఉంటేనే నిత్యాన్నదానం చేసే అవకాశం ఉంది. ఆమేరకు ట్రస్ట్ ఏర్పాటు చేసి అందులో భక్తుల నుంచి విరాళాలను సేకరించాలని నిర్ణయించి, ట్రస్టను రిజిస్టర్ చేయించారు. గురువారం ట్రస్టను హర్షిత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన ట్రస్టుకు మొదటి దాతగా చంద్రగిరి పట్టణం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి రూ.10,116 విరాళంగా అందించారు. అమ్మవారి ఆలయంలో ఇప్పటికే ప్రతి శుక్రవారం సుమారు వెయ్యి మందికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేస్తున్నారని హర్షిత్‌రెడ్డి తెలిపారు. ఇకపై రోజూ నిత్యాన్నదానం చేసేందుకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయడం అభినందనీయమన్నారు. అమ్మవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు ఇవ్వదలచిన వారు చంద్రగిరి ఇండియన్ బ్యాంకు ఖాతా నం.7524056254, ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఐఈఐఐఅ000ఖీ152కు జమ చేయాలని సూచించారు. ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, మస్తాన్, బండారు చంద్రా, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీ కానిస్టేబుల్ అసభ్య దూషణ

- సోషల్ మీడియాలో వైరల్
- కేసు నమోదు చేసిన చంద్రగిరి పోలీసులు

చంద్రగిరి: బాధ్యత గల పదవిలో ఉండి పలువురు రాజకీయ నాయకుల పట్ల, వారి కుటుంబ సభ్యుల పట్ల అసభ్యకర పదజాలంతో దూషించిన ఏపీఏ స్పీ కానిస్టేబుల్ పైన చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. 146, 506, 509 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. వివరాలు.. చంద్రగిరి మండలం, రంగంపేట గ్రామంలో పచ్చిపాల పెద్దరెడ్డెప్ప తిరుమలలో విజిలెన్స్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఇతను గత కొన్నేళ్లుగా రంగంపేటలో పలువురు రాజకీయ నా యకులను టార్గెట్ చేస్తూ తనకు ఇష్టం వచ్చినట్లు, అసభ్యకర పదజాలంతో దూషించి పలువురికి వాట్సాప్ మెసేజ్‌లు పంపేవాడు. గత ఆదివారం కూడా రంగంపేటకు చెందిన ఓ నాయకుడిపైన, వారి కుటుంబ సభ్యులపైన అసభ్యకర పదజాలంతో సోషల్ మీడియాలో పెట్టాడు. అవి వైరల్ అ య్యాయి. దీంతో బాధితులు కానిస్టేబుల్ పెద్దరెడ్డెప్పపై చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చంద్రగిరి సీఐ ఓబులేసు ఆధ్వర్యంలో ఎస్ ఐ వంశీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా రు. కానిస్టేబుల్‌ను విధుల నుంచి తొలగించాలని ఇప్పటికే జిల్లా ఎస్పీకి, టీటీడీ సీవీఎస్వోకు బాధితు లు, గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గతంలోనూ పలువురు మహిళల పట్ల కానిస్టేబుల్ ఇలాగే అసభ్యంగా ప్రవర్తించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వ్యవసాయానికి మెరుగైన విద్యుత్తు


హాజరైన చీఫ్ ఇంజినీర్లు, ఎస్ఈలు, ఎస్ఏఓలు


మాట్లాడుతున్న సీఎండీ సంతోషరావు

- అంతరాయం లేకుండా సరఫరా
- త్వరితగతిన వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరు
- సీఎండీ సంతోషరావు ఆదేశం

తిరుపతి రూరల్: వినియోగదారులకు మెరుగైన విద్యుత్తును సరఫరా చేయాలని ఏపీఎస్‌పీడీసీఎల్ చైర్మన్ – మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ పరిధిలోని చీఫ్ జనరల్ మేనేజర్లు, జనరల్ మేనేజర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని వినియోగదారులకు అంతరాయం లేని విద్యుత్తును సరఫరా చేయాలని సూచించారు. రైతులకు పగటి పూట 9 గంటల విద్యుత్తు సరఫరాకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసిన వెంటనే సర్వీసులు మంజూరు చేయాలని కోరారు. వినియోగదారులకు నిరంతరం అందుబాటులో ఉంటూ విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. సంస్థ పరిధిలో జగనన్న కాలనీల విద్యుదీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విద్యుత్ పంపిణీ నష్టాలు ఎక్కువగా వున్న ఫీడర్లను గుర్తించి, నష్టాలను తగ్గించాలని ఆదేశించారు. వినియోగదారులు విద్యుత్ అంతరాయం, సమస్యలపై టోల్ ఫ్రీ నంబరు 1912 లేదా 1800 425 155333కు కాల్ చేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిస్కమ్ డైరెక్టర్లు వీఎన్ బాబు, శివప్రసాద రెడ్డి, చీఫ్ జనరల్ మేనేజర్లు ధర్మజ్ఞాని, లక్ష్మీనరసయ్య, రషీద్, చలపతి, విజయ కుమార్ రెడ్డి, సురేష్, ఎస్ఈ కృష్ణారెడ్డి, రమణ, మురళి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.